క్లుప్తంగా

రెడ్డి సంక్షేమ సంఘం క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సుజాతనగర్: రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ టి.సునీల్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీ సునీల్‌రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు అన్నపురెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, రెడ్డెం తులసిరెడ్డి, నడికట్టు కోటిరెడ్డి, బాలిరెడ్డి, రంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, కీసర వెంకటేశ్వరరెడ్డి, గురవారెడ్డి, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ శంకర్‌కు సన్మానం



శంకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: కొత్తూరు గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ గార్లపాటి శంకర్‌కు జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో అవార్డు దక్కింది. ఈ మేరకు మంగళవారం జూలూరుపాడులో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఇటీవల ఏపీలోని అరకులో నిర్వహించిన నేషనల్ వర్క్‌షాప్‌లో గిరిజన సంప్రదాయాలు, జీవన విధానంపై తీసిన ఫొటోలకు గాను శంకర్‌కు అవార్డు లభించింది. కార్యక్రమంలో సవడం వెంకటేశ్వర్లు, అనుమల్ల భద్రయ్య, ఎస్కె మల్సూర్ అలీ, మన్నె ఉదయ్‌భాస్కర్, తంబర్ల పుల్లారావు, ఇడుపుల సాంబ, జి.గోపాల్, బుడేన్, బి.సాయి, పి.సత్యనారాయణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

సమస్యలు పట్టని పాలకులు



మాట్లాడుతున్న పర్షిక రవి

ఇల్లెందురూరల్: మతోన్మాదం, ఫాసిజానికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి పర్షిక రవి అన్నారు. సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం న్యూడెమోక్రసీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు కులాల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకునే రాజకీయ నాయకులు పెరిగిపోతున్నారని ఆరోపించారు. వీరిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. యువత, మహిళలకు సంబంధించి అనేక సమస్యలున్నా రాజకీయ పక్షాలు, పాలకులు వాటిని పట్టించుకోకుండా రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగడం సరైంది కాదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పాలకులపై యువత ఉద్యమాల రూపంలో ఒత్తిడి పెంచాలని కోరారు. సమావేశంలో చింత నర్సింహారావు, బొగ్గారపు రాజు, ఎనగంటి లాజర్, భూక్యా మంగ్యా, పాడుగు జార్జ్, మోకాళ్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలే మానవాళికి మనుగడ



మొక్కలతో విద్యార్థులు, అధ్యాపకులు

ఇల్లెందురూరల్: మొక్కలు నాటితేనే అవి చెట్లుగా ఎదిగి మానవాళికి మనుగడ ఉంటుందని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ జిల్లా అధ్యక్షుడు వెంకటపుల్లయ్య అన్నారు. ప్రకృతి హరిత దీక్షలో భాగంగా 119వ రోజు మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 100 రకాల మొక్కలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పోలారపు పద్మకు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలకు జీవం పోస్తూ ప్రకృతి ఎన్ని అవకాశాలు కల్పించినా మానవుడు స్వార్థం కోసం ప్రకృతిని ధ్వంసం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ ఏడాదికి ఒకమొక్కనైనా నాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టి ప్రకృతిని రక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గెజిటెడ్ ఆఫీసర్ క్యాలెండర్లను కళాశాలకు అందజేశారు. కార్యక్రమంలో గెజిటెడ్ ఆఫీసర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ కిరణ్‌కుమార్, బిందుశ్రీ, శారద, చెంచు రత్నయ్య, పిచ్చయ్య, సురేంద్రకుమార్, శేఖర్, సరిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందని వైద్య సేవలు

- ఉల్వనూరు పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది కొరత
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- 24 గంటలూ వైద్యసేవలు అందించాలి
- వైద్యాధికారులను కోరుతున్న స్థానిక ప్రజలు



ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

పాల్వంచరూరల్: నిరుపేదల వైద్యానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే దిక్కు. కానీ సకాలంలో వైద్యం అందక ఆందోళన చెందుతున్నారు. ఆరోగ్యకేంద్రంలో వైద్యులు, సిబ్బంది కొరత ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. నిత్యం 12గంటలు మాత్రమే పనిచేస్తున్న దవాఖాలో 24 గంటలు వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకునే దిక్కు లేదు. పాల్వంచ మండలం మూరుమూల గిరిజన ప్రాంతమైన ఉల్వనూరు గ్రామంలో గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నేలకొల్పారు. ఈ ఆస్పత్రికి 30 కిలోమీటర్ల దూరంలో 38 హ్యాబిటేషన్ గ్రామాలు ఉండగా.. కిన్నెరసాని, యానంబైల్, పాల్వంచ పట్టణంలోని బొల్లోరిగూడెం, పాండురంగాపురం గ్రామాల్లో సబ్ సెంటర్లు ఉన్నాయి. నిత్యం 70 నుంచి 80కి పైన ఓపీ ఉన్న పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం ఒక్కరు డాక్టర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 10 మంది ఏఎన్ఎంలు ఉండాల్సి ఉండగా.. ఎనిమిది మంది ఉన్నారు. ముగ్గురు హెల్త్ సూపర్‌వైజర్లకు గాను ఒక్కరు ఉన్నారు. మరో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్టాఫ్ నర్సులు ఇద్దరికి ఒక్కరే ఉన్నారు. ఫార్మసిస్ట్ డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఉన్న సిబ్బంది కూడా పాల్వంచ నుంచి రాకపోకలు సాగించడం వలన సమయపాలన పాటించడం లేదు. ప్రతిరోజు ఆస్పత్రి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పనిచేయడం వలన రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ తర్వాత ఏదైనా అత్యవసరమైతే పాల్వంచలోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న పరిస్థితి. ఆస్పత్రికి కనీసం అంబులెన్స్ సౌకర్యం కూడా లేకపోవడంతో ఈ ప్రాంతంలోని పేదలు వైద్యానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ ఆస్పత్రికి ఎక్కువ గిరిజనలే వైద్యచికిత్సకు వస్తుంటారు. కనీసం రహదారి సౌకర్యం కూడా లేని ఆదివాసీ గిరిజన గూడాలు ఆరు ఉన్నాయి. అక్కడ గిరిజనులకు ఆస్పత్రి సమయం 4 గంటలు దాటిన తర్వాత ఎవరికైనా ఏదైనా ప్రమాదం జరిగిన వైద్యం కోసం పాల్వంచకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. సరైన సమయంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఉల్వనూరు పీహెచ్‌సీని 24 గంటలపాటు వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

24 గంటలూ వైద్యం అందించాలి



ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతతోపాటు కేవలం రోజుకు 12 గంటలు మాత్రమే వైద్యసేవలు అందించడం వలన గిరిజన ప్రజలకు సరైన వైద్యం అందడం లేదు. ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బందిని భర్తీ చేసి 24 గంటలూ వైద్యసేవలు అందించాలి. – వాసం రుద్ర, సర్పంచ్, ఉల్వనూరు

రాత్రిపూట ఇబ్బంది పడుతున్నాం



ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలకే మూసివేస్తున్నారు. ఆ తర్వాత రాత్రి సమయంలో వైద్యం అందక ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. 24 గంటలూ వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.– దూలం భరత్‌కుమార్, లక్ష్మీదేవిపల్లి

ప్రతిపాదనలు పంపుతాం



ఉల్వనూరు పీహెచ్‌సీ 24 గంటలు వైద్యసేవలు అందించేందుకు పైఅధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. వైద్యసేవలు పెంచాలంటే సిబ్బంది సంఖ్య పెంచాల్సి ఉంటుంది. ప్రభుత్వం మంజూరు చేస్తే అమలు చేస్తాం. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. – శిరీష, జిల్లా వైద్యాధికారి

రక్షణ సూత్రాలు పాటించాలి

టేకులపల్లి: కేటీసీలో పని చేస్తున్న కార్మికులు, అధికారులు, సూపర్‌వైజర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఇల్లెందు ఎస్ఓటూ జీఎం, కేటీసీ ఇన్‌చార్జ్ పీఓ మల్లారపు మల్లయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం కేటీసీ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్షణపై అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్పత్తిలో రక్షణ పరంగా ప్రతి ఉద్యోగి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతి ఉద్యోగి విధుల్లోకి వెళ్లే ముందు, విధులు ముగించుకుని వచ్చే సమయంలోనూ విధిగా రక్షణ సూత్రాలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మేనేజర్ సౌరభ్ సుమన్, డిప్యూటీ మేనేజర్ బ్రహ్మం, రవికుమార్, ఇంజనీర్ నాగేశ్వు, అశోక్, పిట్ కార్యదర్శి ఆర్.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పొదుపు సంఘాలకు రుణాలివ్వండి



మాట్లాడుతున్న రజిత

ఇల్లెందురూరల్: మహిళా స్వయం సాధికారతే లక్ష్యంగా రాష్ట్రంలో ఏర్పాటు చేసిన పొదుపు సంఘాలు కేసీఆర్ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు, పీఓడబ్ల్యూ నేతలు వీరమళ్ల ఉమ, చింత రజిత అన్నారు. పట్టణంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు పావలా వడ్డీ రుణాలు ఇచ్చేవని, ప్రస్తుత ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు ఇస్తామని ప్రకటించి నేడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. పొదుపు సంఘాలన్నింటికి రూ.20 లక్షల వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలన్నారు. అభయహస్తం పునరుద్ధరించాలని, జనశ్రీ,, ఆమ్ ఆద్మీ బీమా యోజన పథకాలను కొనసాగించాలని కోరారు. స్త్రీనిధి మహిళా బ్యాంకులను గ్రామపరిధిలోనే ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇలా పలు డిమాండ్లతో ఫిబ్రవరి 6న ఇల్లెందులో నిర్వహించే ప్రదర్శన, ధర్నా కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. తుపాకుల నాగేశ్వరరావు, మంగ లత, వాంకుడోత్ సరోజిని, కల్తి సుభద్ర, కల్తీ కోటమ్మ, ఈసాల పాపమ్మ, వెంకటమ్మ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి వీఆర్ఎస్ తప్పదు



మాట్లాడుతున్న నర్సయ్య

కొత్తగూడెంటౌన్: తెలంగాణ ఉద్యమకారులను గుర్తించకుంటే బీఆర్ఎస్ పార్టీ వీఆర్ఎస్ తీసుకోక తప్పదని తెలంగాణ ఉద్యమకారుల పోరం గౌరవ చైర్మన్ శ్రావణబోయిన నర్సయ్య ముదిరాజ్ హెచ్చరించారు. మంగళవారం కొత్తగూడెంలో జరిగిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు కష్టపడి తెలంగాణను సాధించిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని, నిజమైన ఉద్యమకారులను కేసీఆర్ గుర్తించి వారికి తక్షణమే పెన్షన్ ప్రకటించాలని స్వాతంత్ర్య సమరయోధులకు పెన్షన్, డబుల్ బెడ్ రూం, ఉచిత వైద్యం, ఉచిత రవాణా సదుపాయాలను కల్పించి ఏ–1 గ్రేడ్ కింద గుర్తింపు ఇవ్వాలని కోరారు. 1969 – 2014 వరకు రాష్ట్రాన్ని సాధించేందుకు పోరాటం చేసిన వారందరినీ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వలీబాబా, అల్లి భాస్కరరావు, శ్రీపాద సత్యనారాయణ, ఎడ్ల ఏలియా, కాకెల్లి సైమన్, సప్తార్‌బేగ్, లింగయ్య పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణకు కుట్ర

టేకులపల్లి: విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అధిక భారం మోపుతున్న ఏసీడీ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బాణోతు సరిలాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌శాఖ గత సంవత్సరం అధిక లోడు పేరుతో వేల రూపాయలు వసూలు చేసిందని మళ్లీ ఇప్పుడు ఏసీడీ పేరుతో విద్యుత్ వినియోగదారులపై అధిక బారం మోపడం సరైంది కాదన్నారు. డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు విద్యుత్ నియంత్రణ మండలి ఇస్తున్న మితిమీరిన స్వేచ్ఛ ఫలితంగా వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. విద్యుత్‌ను ప్రైవేటీకరణ చేసే కుట్రలో భాగంగానే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. విద్యుత్ మీటర్లు తీసుకునే సమయంలోనే బ్యాంకులో, మీసేవా కేంద్రాల ద్వారా వేల రూపాయలు వసూలు చేస్తూనే మళ్లీ ఏసీడీ బాదుడేందని ఆవేదన వ్యక్తం చేశారు.

పాలకుల మొండి వైఖరి వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు, చిరు వ్యాపారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌పై ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బూర్గంపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అశ్వాపురం మండలం కళ్యాణపురం సెక్టార్ సూపర్‌వైజర్‌పై ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ అనుదీప్‌కు ఫిర్యాదు చేశారు. మాట్లాడుతూ.. సూపర్‌వైజర్ తోటి ఉద్యోగులు, అధికారుల పట్ల దురుసుగా, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ లోపం కారణంగా చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై రాష్ట్ర విజిలెన్స్ శాఖ కూడా సదరు సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. టీచర్లు, ఆయాలు, అధికారులపై అసభ్యకరంగా వాట్సాప్‌లో పోస్టింగులు పెడుతూ అవమానానికి గురిచేస్తోందని వాపోయారు.

ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా వీరభద్రం



జూలూరుపాడు: ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) చంద్రుగొండ అడ్డా అధ్యక్షుడిగా మల్కం వీరభద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జూలూరుపాడులో చంద్రుగొండ క్రాస్ రోడ్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కొమ్ముగిరి కామేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా కోటేశ్వరరావు, గౌరవ సలహాదారులుగా బాపట్ల పూర్ణచందర్‌రావు, వల్లమల సామేలులను ఎన్నుకున్నారు.

రేపు నవోదయ ఉచిత మోడల్ టెస్ట్

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 26న కొత్తగూడెం గణేష్‌టెంపుల్ ఏరియాలోని ఈజీ సొల్యూషన్స్ స్టడీ సర్కిల్‌లో ఉచిత నవోదయ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సర్కిల్ నిర్వాహకులు వై.శైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పరీక్ష రాసే వారు ముందుకుగా 8464803391 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

జంతు సంక్షేమంపై అవగాహన



విద్యార్థులతో పశు వైద్యాధికారులు, సతీష్ ఖండేల్‌వాల్

ఇల్లెందు: మానవ జీవనం విధానంలో జంతువుల ప్రాముఖ్యత ముడిపడి ఉందని, జంతువుల సంక్షేమానికి బాల్యం నుంచే అవగాహన కలిగి ఉండాలని గాయత్రీ పరివార్ యుగ్ నిర్మాణ్ మిషన్, జంతు సంక్షేమ బోర్డు సభ్యులు సతీష్ ఖండేల్‌వాల్, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ పురంధర్ అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నెంగులగడ్డ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకు ముందు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ, కార్తీక, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల సందర్శన

జూలూరుపాడు: గుండెపుడి, కొత్తూరు గ్రామాల్లోని నర్సరీలు, డంపింగ్ యార్డులను ఎంపీడీఓ కేఎస్ వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నర్సరీలు, డంపింగ్ యార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండరాదని పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు. అనంతరం అన్నారుపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ డి.రామారావు, ఈజీఎస్ ఏపీఓ రవి, పంచాయతీ కార్యదర్శులు శ్రీను, సుమ, బి.రమణి, డాక్టర్ తేజశ్విని, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీఎండీతో విద్యుత్ జేఏసీ భేటీ



సీఎండీ ప్రభాకర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: ఫిబ్రవరి 1 నాటికి పీఆర్‌సీ విడుదల చేయాలని లేదంటే ఆందోళన బాట పడతామని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు అన్నారు. ఈ మేరకు జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ విద్యుత్ సౌధలో సీఎండీ డి.ప్రభాకర్‌రావుతో సమావేశం నిర్వహించి చర్చించారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఏప్రిల్1, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని విడుదల చేయాలని, పది నెలల ఏరియర్స్ అందించాలని కోరారు. సీఎండీ సానుకూలంగా స్పందించారని, ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పినట్లు తెలిపారు. లేని పక్షంలో ఫిబ్రవరి 1న నల్లబ్యాడ్జిలతో నిరసన, 2న విద్యుత్ సౌధ ముట్టడి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్, సాయిబాబా, శ్రీధర్, డి.రాధాకృష్ణ, గోవర్ధన్, రత్నాకర్, అనిల్, సదానందం, 29 సంఘాల నేతలు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏరియా జీఎం రమేష్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని గౌతంపూర్ ప్రాంతంలోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో ఈనెల 26న నిర్వహించనున్న 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేడుకల నిర్వహణను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఎస్ఓటూ జీఎం ఆర్.నారాయణరావు, ఏజీఎం (ఈఅండ్ఎం) వై.రఘురామిరెడ్డి, డీజీఎం పర్సనల్ సామ్యూల్ సుధాకర్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఏ.రమణారెడ్డి, ఏరియా ఇంజనీర్ అనిల్, సివిల్ ఇంజనీర్ రాజారామ్, సీనియర్ పీఓలు మురళి, జి.సుధాకర్, బెన్‌హర్, సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, జే.లవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచ: దివ్యాంగులు కలిసి కట్టుగా సమస్యలు పరిష్కరించుకోవాలని టీపీసీసీ సభ్యుడు ఎడవల్లి కృష్ణ అన్నారు. ఈనెల 29న కొత్తగూడెం క్లబ్ వేదికగా నిర్వహించనున్న దివ్యాంగ మిత్రుల ఆత్మీయ సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం నింపి వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగురాలిని ఆదర్శ వివాహం చేసుకునేందుకు వచ్చిన నర్సింహారావును అభినందించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రంగారావు, చారి, రాములు నాయక్, రవూఫ్, సత్యనారాయణ, గుండపనేని సతీష్, ఖాదర్‌బాబా, కాటి నాగేశ్వరరావు, నయీమ్, అజారుద్దీన్, సునీత, అల్తాఫ్, నాగేశ్వరరావు, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై సమీక్ష



మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ రాంబాబు

సుజాతనగర్: నేటి నుంచి మండల వ్యాప్తంగా ఉపాధి పనులపై రెండో విడత సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. ఈ మేరకు స్థానిక రైతు వేదికలో ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ రాంబాబు మాట్లాడుతూ.. 2020 జనవరి నుంచి 2022 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. 27 నెలల కాలంలో మొత్తం రూ.13 కోట్లతో ఉపాధి పనులు జరిగానట్లు చెప్పారు. తనిఖీల్లో ఎంబీ, ఫీల్డు ప్రకారంగా డీఆర్‌పీలు నివేదికలు తయారు చేయడం జరుగుతుందన్నారు. పనులు చేపట్టిన కాలంలో జరిగిన ప్రతి పనిని పరిశీలించనున్నట్లు తెలిపారు. తనిఖీ అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామసభలో తనిఖీ నివేదికలు చదివి వినిపించడం జరుగుతుందని పేర్కొన్నారు. తనిఖీ బృందానికి స్థానికులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి, ఏపీఓ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

బీమాతోనే జీవితానికి ధీమా




చెక్కు అందజేస్తున్న అధికారులు

టేకులపల్లి: బోడు ఏపీజీవీబీలో మంగళవారం ఆర్థిక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. బ్యాంకు ద్వారా ఖాతాదారులకు, ప్రజలకు లభిస్తున్న సేవలను బ్యాంకు అధికారుల వివరించారు. మాట్లాడుతూ.. పెట్రాంచెలక స్టేజీ గ్రామానికి చెందిన దారావత్ నాగేశ్వర్‌రావు కొన్ని నెలల క్రితం బ్యాంకులో రూ.1000 జనరల్ ఇన్సూరెన్స్ కట్టి ఉన్నాడు. ఇతను ఇటీవల మృతి చెందడంతో నామినీ అయిన అతని కుమారుడు ప్రసాద్‌కు రూ.20లక్షలు ఇన్సూరెన్స్ చెక్కుని అందజేశారు. అదేవిధంగా పీఎంజేజేబీవై పథకం ద్వారా రూ.330 ఇన్సూరెన్స్ చెల్లించిన ఈసాల సుమలత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నామినీ అయిన ఈమె భర్త వెంకటేశ్వర్లుకి రూ.2లక్షల బీమా చెక్కుని అందజేశారు. ఖాతాదారులు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రమాదవశాత్తు జరగరానిది ఏదైనా జరిగితే కుటుంబానికి ఆసరా అవుతుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అడ్మిన్ నెహ్రూ, నోడల్ ఆఫీసర్ సునీల్, బోడు బ్రాంచి మేనేజర్ చంద్రశేఖర్, ఏఈఓ రమేష్, సర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, హనుమంతు, భూక్యా సైదులు, పూనెం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

ఇల్లెందు: జాతీయ ఓటర్స్ డే సందర్భంగా... ఇల్లెందులో రెవెన్యూ, మున్సిపల్, మండల పరిషత్, విద్య, వైద్య, పోలీస్, ఇతర శాఖల ఉద్యోగులు, అధికారులు ఓటు హక్కుపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 12 గంటలకు గోవింద్ సెంటర్ నుంచి జగదాంబా సెంటర్ మీదుగా పాత బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిచ మానవహారం నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా జాతీయ రహదారి

బీసీఎం జాతీయ రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. మండల పరిధి కేశవాపురం వద్ద రోడ్డు పక్కన నీటి ఊట పట్టి నిరంతరం నీళ్లు ప్రవహించడంతో రోడ్డు కోతకు గురైంది. దీంతో వాహనాల రాకాపోకలకు ప్రమాదకరంగా మారింది. మిషన్ భగీరథ పైపులైన్ లీకై రహదారి పక్కన నిత్యం ప్రవహిస్తోంది. డ్రెయినేజీ నిర్మాణం చేయకపోవడంతో ఈ నీటితో రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు కోతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : యుగేందర్,
జాతీయ రహదారి ఈఈ
సెల్ నంబర్ : 8333923755

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
బి. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లెందు బి. శేషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాప్రసాద్ - 79979 58226 | టోల్ ఫ్రీ నెం.: 1800 270 1083
సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమన శుభాకాంక్షలు అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
డి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416